**RELEASED FROM**
**CPI(M) State Office**
H.No. 27-28-12, Yamalavari Street,
Governor Pet, Vijayawada -2
PH 0866 - 2577202, Fax : 0866-2577203.
E-mail: cpimap@gmail.com

# వామపక్ష పార్టీలు

**విజయవాడ,**
**తేది : 10 మే, 2020.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
వెలగపూడి.

**ప్రచురణార్థం:** ఈరోజు వామపక్ష పార్టీలు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం.
**– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : (1) లాక్‌డౌన్ కాలానికి ప్రభుత్వ జీవోల ప్రకారం జీతాల చెల్లింపు కోరుతూ,**

**(2) పరిశ్రమల్ని నడిపించే ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శక సూత్రాల అమలును కోరుతూ,**

**(3) పై ఉత్తర్వులు అమలు చేయని జూట్ మిల్లుల యాజమాన్యాలపై చట్టపర చర్యలు తీసుకోవాలని కోరుతూ...**

**ఆర్యా!**

మన రాష్ట్రంలో మొత్తం ఏడు జూట్ మిల్లుల్లో పనిచేస్తున్న 10 వేల మంది కార్మికులు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో వున్నారు. అది కేవలం పారిశ్రామిక వివాదంగానే కాకుండా కోవిడ్-19 నేపథ్య సామాజిక సమస్యగా కూడా మారింది. దీన్ని మీ దృష్టికి తెచ్చి తక్షణ పరిష్కారం కోసం సత్వర చర్యల్ని కోరుతూ మా పార్టీలు ఈ కింది సంయుక్త విజ్ఞప్తి చేస్తున్నాయి.

లాక్‌డౌన్ కాలంలో ఆయా పారిశ్రామిక యాజమాన్యాలు కార్మికులకు జీతాలు చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవోలు విడుదల చేశాయి. వాటిని రాష్ట్రంలోని జూట్ మిల్లుల యాజమాన్యాలు అమలు చేయడం లేదు. ఇప్పుడు పరిశ్రమల్ని నడిపించడానికి కేంద్రం సడలింపుల్ని ఇచ్చింది. వాటిని నడిపించే ప్రక్రియలో కోవిడ్-19 వ్యాప్తి నియంత్రణ కోసం చేపట్టాల్సిన మార్గదర్శక సూత్రాల్ని కూడా విడుదల చేసింది. వాటిని పర్యవేక్షణకి కూడా నిర్దిష్ట సూచనలు ఇచ్చింది. వాటి అమలుకు జూట్ మిల్లుల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి.

ఒకవైపు జీతాల చెల్లింపు జీవోల అమలుకు నిరాకరణ వల్ల, మరోవైపు కరోనా వ్యాప్తి నియంత్రణ పట్ల నిర్లక్ష్యం వల్ల, రాష్ట్రంలోని ఈ క్రింది మొత్తం ఏడు జూట్ మిల్లుల్లో తీవ్ర అశాంతి ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరులోని రెండు జూట్ మిల్లులు, విజయనగరం జిల్లాలో నెల్లిమర్లలోని జూట్ మిల్లు, సాలూరులోని ఏ.పి. ఫైబర్ జూట్ మిలు మరియు బొబ్బిలిలోని నవ్య జూట్ మిల్లు, శ్రీకాకుళం జిల్లా మరియు రూరల్‌లోని నీలం జూట్ మిల్లు, విశాఖ జిల్లా, పద్మనాభం మండలంలోని ఎ.యస్. జూట్ మిల్లులలో సమస్య ఏర్పడింది. ఇది మొత్తం సుమారు 10 వేల మంది కార్మిక కుటుంబాలతో ముడిపడ్డ సమస్యగా ఉందని మీకు మనవి చేస్తున్నాం.

జీతాల చెల్లింపు చేయక పోవడం వల్ల దీన్ని పారిశ్రామిక వివాదంగా మార్చింది. మరోవైపు కోవిడ్-19 వ్యాప్తి నియంత్రణకై మార్గదర్శక సూత్రాలను అమలు చేయకపోవడంవల్ల దీన్నొక సామాజిక సమస్యగా మార్చింది. ఈ రెండు సమస్యల పట్ల తక్షణమే మీరు స్పందించి పరిష్కారంకై తగు చర్యల్ని చేపట్టాలని కోరుతున్నాం.

కోవిడ్-19 నేపథ్యంలో తెరుస్తున్న పరిశ్రమలలో కార్మికులకు కూడా ప్రమాదం పొంచి ఉంది. వారికి భీమా సదుపాయం కల్పించాల్సి ఉందని మా పార్టీలు భావిస్తున్నాయి. ఇది సామాజిక సమస్యగా భావించి అట్టి భీమా వసతి ద్వారా జీవిత భద్రతను కల్పించాల్సిందిగా మా పార్టీలు కోరుతున్నాయి.

"త్రిప్పి చూడగలరు"

నిజానికి పర్యావరణానికి అనుకూలమైన గోనెసంచుల ఉత్పత్తుల పట్ల శ్రద్ధ ప్రదర్శిస్తున్న మీ ప్రభుత్వ నిర్ణయాన్ని మా పార్టీలు స్వాగతిస్తున్నాయి. అదే సమయంలో అందుకు ఆటంకంగా మారిన జూట్ యాజమాన్యాల వైఖరిపై మీ ప్రభుత్వం తగు సత్వర కఠిన చర్యల్ని చేపట్టడం అందులో భాగమౌతుందని కూడా తెలియజేస్తున్నాము.

తాజాగా బొబ్బిలి నవ్య జూట్ మిల్లును తెరిపిస్తూ స్థానికంగా యాజమాన్యం, సిఐటియు అనుబంధ యూనియన్ మధ్య లాక్‌డౌన్ కాలానికి జీతాలలో తలకు ఐదు వేల రూపాయల అనామత్ చెల్లింపుకు అంగీకరిస్తూ ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఇది లాక్‌డౌన్ కాలపు జీతాలు మొత్తం కాకపోయినా ఒక తాత్కాలిక ఒప్పందం. ఇదే నమూనాలో శ్రీకాకుళం జిల్లాలోని నీలం జూట్ మిల్లులో కూడా యాజమాన్యానికీ, సిఐటియు, ఐఎఫ్‌టియు యూనియన్లకూ మధ్య ఒప్పందం కుదిరింది. జీవోల ప్రకారం పూర్తి స్థాయి జీతాల చెల్లింపుకు కార్మిక శాఖ ద్వారా సమగ్ర పరిష్కారం ప్రయత్నాలు చేస్తూనే, ముందుగా కనీసం పై ఒప్పందాలనైనా అమలు చేయించి పారిశ్రామిక అశాంతి నివారణకై తక్షణ ప్రయత్నాలు చేపట్టాల్సిందిగా కోరుతున్నాం.

పై చట్టపరమైన ఉత్తర్వులని అమలు చేయని యాజమాన్యాలకి అనుకూలంగా, న్యాయమైన కోర్కెల్ని కోరే కార్మిక సంఘాల పట్ల వ్యతిరేకంగా పోలీస్ జోక్యం ఉంది. మీరు జోక్యం చేసుకొని పోలీసు శాఖ వైపు నుండి అలాంటి అనుచిత జోక్యందారీ పాత్రని నియంత్రించుటకు తగు చర్యల్ని చేపట్టాలని కోరుతున్నాం.

ఈ సందర్భంగా లేబర్, రెవిన్యూ శాఖాధికారుల పాత్ర కూడా జూట్ యాజమాన్యాలకి అనుకూలంగా, జీవోల అమలును కోరే కార్మికులకు వ్యతిరేకంగా ఉంది. కావున సత్వర నియంత్రణకై మీదృష్టికి తెస్తున్నాం.

ఏలూరుతో పాటు కొన్ని జూట్ మిల్లుల్లో దూర ప్రాంతాలకు చెందిన కార్మికులున్నారు. వారిలో రాష్ట్రేతర మరియు రాష్ట్రాంతర కార్మికులు వున్నారు. తమ స్వంత ప్రాంతాలకు వెళ్తామని కోరుకుంటున్నారు. ఆయా జూట్ యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. మీరు జోక్యం చేసుకొని వారికి రవాణా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాం.

ప్రస్తుతం రాష్ట్రంలో చిట్టివలస జూట్ మిల్లుతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో మరికొన్ని జూట్ మిల్లులు లాకౌట్లలో ఉన్నాయి వాటిని తెరిపించాల్సిందిగా కూడా విజ్ఞప్తి చేస్తున్నాం.

లాక్‌డౌన్ కాలానికి జీతాల చెల్లింపుకై మీ ప్రభుత్వం ఇచ్చిన జీవోలని సవాల్ చేస్తూ రాష్ట్ర జూట్ యాజమాన్యాలు న్యాయస్థానాలకి వెళ్తున్నాయి. ఒకవేళ అనుకోకుండా జీవోల అమలుకు న్యాయపరమైన ఆటంకాలు ఏర్పడితే, మీరిచ్చిన జీవోల పట్ల నిబద్ధతతో వెంటనే జీతాల చెల్లింపు స్ఫూర్తికి భంగం కలగకుండా తగు న్యాయపరమైన చర్యల్ని చేపట్టాల్సిందిగా కూడా కోరుతున్నాం.

మా పార్టీలు చేస్తున్న పై విజ్ఞప్తులపై మీరు తక్షణమే స్పందించాలని కోరుతున్నాం.

అభివందనములతో...

| | | |
|---|---|---|
| Ramakrishna | | సం/- |
| **(కె.రామకృష్ణ)** | **(పెనుమల్లి మధు)** | **(వై.సాంబశివరావు)** |
| సిపిఐ | సిపిఐ(యం) | సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ |
| సం/- | సం/- | సం/- |
| **(జాస్తి కిషోర్‌బాబు)** | **(కాటం నాగభూషణం)** | **(బి.బంగార్‌రావ్)** |
| సిపిఐ(యంఎల్) | యంసిపిఐ(యు) | సిపిఐ(యంఎల్) లిబరేషన్ |

| | | | |
|---|---|---|---|
| సం/- | | | |
| **(చిట్టిపాటి వెంకటేశ్వర్లు)** | **(బి.ఎస్. అమర్‌నాథ్)** | **(పి.వి.సుందరరామరాజు)** | **(జానకి రాములు)** |
| సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ | యస్‌యుసిఐ(సి) | ఫార్వర్డ్‌బ్లాక్ | రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ |